COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు,** విజయవాడ
గౌరవ ముఖ్యమంత్రి, తేది: 13.09.2015
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
హైదరాబాదు.

ప్రచురణార్థం: ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. – **ఆర్.లక్ష్మయ్య,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : రాష్ట్రంలో బలవంతపు భూసేకరణ ఆపాలని కోరుతూ...**

**ఆర్యా!**

ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి పేరుతో రైతుల భూములను బలవంతంగా భూసేకరణ చేయడాన్ని ఆపాలి. సారవంతమైన వ్యవసాయ భూములను బడా కార్పొరేట్ కంపెనీలకు పారిశ్రామిక వేత్తలకు దారాదత్తం చేయడం సరిగాదు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల ఎకరాలు భూబ్యాంక్ ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించడం సరికాదు. అభివృద్ధి పేరుతో అవసరానికి మించి పెద్ద మొత్తంలో రెండు, మూడు పంటలు పండే భూములను రైతులనుండి బలవంతంగా తీసుకోవడాన్ని విరమించుకోవాలని సిపియం కోరుతోంది. రైతుల సాగులో వున్న ప్రభుత్వ భూముల్ని, అటవి భూముల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొంటే రైతులేగాక వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు, కౌలురైతులు పెద్ద సంఖ్యలో ఉపాధి కోల్పోతారు. ఈ భూబ్యాంకు విధానాన్ని ఉపసంహరించాలి.

రాజధాని నిర్మాణానికి మూడు పంటలు పండే భూములను ల్యాండ్ పూలింగ్ పేరుతో బలవంతంగా 33వేల ఎకరాలు సేకరించారు. ఇది చాలదన్నట్లు మరో 54 వేల ఎకరాలు అటవీ భూములను సేకరిస్తోంది. కృష్ణా నది ఒడ్డున అదనంగా 10వేల ఎకరాలు స్వాధీన పరుచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. 5 వేల ఎకరాలు సరిపడే రాజధాని కోసం లక్షా 11వేల ఎకరాలు సేకరించి బడా కంపెనీలకు కట్టబెట్టడాన్ని సిపియం వ్యతిరేకిస్తున్నది. లక్షలాది భూములు తీసుకోవడం వల్ల భూమి మీద ఆధారపడిన రైతులేగాక వ్యవసాయ కార్మికులు, చేతివృత్తి దారులు, కౌలురైతులు రోడ్డున పడుతున్నారు . అంతేకాక సాగు భూములు తీసుకోవడంగానీ, రైతుల ఆమోదం లేకుండా తీసుకోవడంగానీ, 2013 భూసేకరణ చట్ట నిబంధనలు అనుమతించవు.

వివిధ జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధి, విద్యుత్ ప్లాంట్‌ల నిర్మాణం, ఇండస్ట్రియల్ కారిడార్, పోర్టుల అభివృద్ధి, ఎయిర్ పోర్టుల నిర్మాణం, ఇలా వేలాది ఎకరాలు బలవంతపు భూసేకరణ వల్ల అత్యధికంగా దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల పేదరైతులే ఎక్కువగా భూములు కోల్పోతున్నారు. భూములు కోల్పోతున్న రైతులకు పరిశ్రమల్లో ఉద్యోగాల కల్పన హామీ సైతం ఇవ్వలేదు. బలవంతంగా భూములు గుంజుకోరాదని రైతులు, ప్రతిపక్షాలు ప్రభుత్వానికి ఎంతగా మొరపెట్టుకున్నా మొండిగా ప్రభుత్వం భూసేకరణకు పూనుకుంటున్నది. గత్యంతరం లేక రైతులు పెద్దఎత్తున ప్రతిఘటనకు పూనుకుంటున్నారు.

2013 భూసేకరణ చట్టాన్ని ప్రక్కన పెట్టి కాలం చెల్లిన నరేంద్రమోడి ఆర్డినెన్సు ద్వారా భూసేకరణకు పూనుకోవడాన్ని విరమించుకోవాలని సిపియం డిమాండ్ చేస్తున్నది.

రెవెన్యూ పోరంబోకు భూములు, చెరువు లోతట్టు భూములు పేదలు ఆక్రమించి సాగు చేసుకుంటూ పట్టాలు పొంది చాలాచోట్ల అనుభవిస్తున్నారు. పేదల చేతుల్లో ఉన్న ఈ ఎస్సైన్డ్ భూములు, బంజరు భూములు, పోరంబోకు భూములు, అటవీ భూములు అవి ప్రభుత్వ భూములే కాబట్టి నష్ట పరిహారం చెల్లించకుండా స్వాధీనం చేసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాల్లో దౌర్జన్యంగా భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభం అయ్యాయి. బంజరు భూములైనా అటవీ భూములైనా పేదల స్వాధీనంలో ఉన్న భూముల్ని పట్టా భూములుగానే భావించి నష్ట పరిహారం, పునరావాసం కల్పించాలని సిపియం రాష్ట్ర కమిటి డిమాండ్ చేస్తున్నది.

"కొనసాగింపు – 2"

తరతరాలుగా అడవిని నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులు, ఇతర పేదల్ని ఫారెస్టు భూములనుండి బలవంతంగా తరిమివేసే ప్రయత్నాన్ని స్వస్తి చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపియం డిమాండ్ చేస్తున్నది. ఫారెస్టు భూములను డీనోటిఫై చేసి పారిశ్రామిక వేత్తలకు, ఆధ్యాత్మిక సంస్థలకు, పర్యాటక కేంద్రాలకు కట్టబెట్టడాన్ని సిపియం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. అనేక జిల్లాల్లో ఇళ్ళ స్థలాల కోసం సేకరించిన వేలాది ఎకరాల భూమిని పేదలకు ఇవ్వకుండా నిలుపుదల చేసిన జీవోను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతోంది. అవసరానికి మించి భూముల్ని పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే విధానాన్ని విడనాడాలని అలాగే ల్యాండ్ బ్యాంకు విధానాన్ని విడనాడాలని డిమాండ్ చేస్తున్నది.

**<u>డిమాండ్లు</u>**

**(1)** పారిశ్రామిక అభివృద్ధి పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలి.

**(2)** అవసరానికి మించి భూములు రైతులనుండి తీసుకోరాదు.

**(3)** ఎస్సైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, ఫారెస్టు భూములనుండి పేదలను తొలగించరాదు. పట్టా భూములకిచ్చే నష్ట పరిహారాన్నే వీరికీ ఇవ్వాలి.

**(4)** పరిశ్రమల పేరుతోనూ, రాజధాని పేరుతోనూ సేకరించిన భూముల్ని ప్రభుత్వం కార్పొరేట్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు ఇవ్వరాదు.

**(5)** పరిశ్రమల ఏర్పాటు పేరుతో, ఎస్ఈ జెడ్ల పేరుతో సేకరించి ఐదేళ్ళకు మించి నిరుపయోగంగా ఉన్న భూములను తిరిగి రైతులకే ఇవ్వాలి.

**(6)** ల్యాండ్ బ్యాంక్ విధానానికి స్వస్తి చెప్పాలి.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**

రాష్ట్ర కార్యదర్శి